బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఏడాదంతా సిల్వర్‌జూబ్లీ వేడుకలు

- బీఆర్ఎస్ ఉజ్వల ప్రస్థానం.. తెలంగాణ బతుకు చిత్రం.. రెండూ వేర్వేరు కాదు
- ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ
- అన్నిస్థాయిల్లో సంస్థాగత నిర్మాణం పూర్తి కావాలి
- విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ (సిల్వర్ జూబ్లీ) వేడుకలను ఏడాదంతా జరుపుకునే విధంగా కార్యాచరణ రూపొందించాలని పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం తెలంగాణభవన్‌లో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ కోసం, తెలంగాణ సమాజంలోంచి ఉద్భవించి ఉజ్వల ప్రస్థానం సాగించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు జరుపుకోవడం మామూలు విషయం కాదని చెప్పారు. మిగతా రాజకీయ పార్టీలు వేరు.. బీఆర్ఎస్ పుట్టుక, ప్రయాణం వేరని తెలిపారు. మిగితా రాజకీయ పార్టీలకు 25 ఏండ్ల చరిత్ర కేవలం పార్టీ చరిత్రే అవుతుందని, అదే బీఆర్ఎస్ పార్టీకి అలా కాదని వివరించారు. తెలంగాణలోని ప్రతి వర్గం భాగస్వామ్యం అయ్యేలా, తెలంగాణలోని ప్రతిబిడ్డా వేడుకల్లో మమేకం అయ్యేలా కార్యక్రమాలు రూపొందించుకోవాలని సూచించారు. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, చైతన్యవేదిక బీఆర్ఎస్ పార్టీ అని స్పష్టంచేశారు. తొలుత ఫిబ్రవరిలోనే భారీ బహిరంగసభ నిర్వహించాలని భావించామని, అయితే, పార్టీ రజతోత్సవ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవంనాడు భారీ బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ నాయకులు, వివిధ వర్గాల పెద్దలు సూచించారని చెప్పారు. దీంతో ఏప్రిల్ 27న భారీ బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించాయమని చెప్పారు. అంతుకుముందే ప్రతినిధుల సభ నిర్వహిస్తామని తెలిపారు.

ప్రతినిధుల సభ నుంచి బహిరంగ సభ వరకు..

ప్రతినిధుల సభ నాటికే సభ్యత్వ నమోదు పుస్తకాలు సిద్ధం చేసుకోవాలని పార్టీ శ్రేణులను కేసీఆర్ ఆదేశించారు. ప్రతినిధుల సభ నుంచి నియోజకవర్గాలవారీగా సభ్యత్వ నమోదుకు అవసరమైన పుస్తకాలను ప్రతినిధులకు అందించాలని సూచించారు. అదే సమయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభకు అవసరమైన

> మిగతా రాజకీయ పార్టీలు వేరు.. బీఆర్ఎస్ పుట్టుక, ప్రయాణం వేరు. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, చైతన్యవేదిక బీఆర్ఎస్ పార్టీ. దేశంలో మరే రాజకీయ పార్టీకి లేని చరిత్ర బీఆర్ఎస్‌కు ఉన్నది.
>
> -బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ఎనిమిది ఎనిమిది ఇస్తే ఎలగబెట్టిందేంది?

> పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎనిమిది మంది ఎంపీలను, బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఇస్తే ఆ రెండు పార్టీలు వెలగబెట్టింది ఏమిటని ? కేసీఆర్ నిప్పులు చెరిగారు. ఆ పార్టీల 16 మంది ఎంపీలు తెలంగాణకు పైస పనిచేశారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టిన ప్పటి నుంచి తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, హక్కుల సాధన కోసం పేగులు తెగేదాకా కొట్లాడిందని గుర్తుచేశారు. పార్టీ సిల్వర్‌జూబ్లీ సందర్భంగా పార్టీ అజరామర ఘట్టాలను, అద్వితీయ తెలంగాణ పోరాట చరిత్రను, సాంస్కృతిక వైభావాన్ని ప్రతీ ఒక్కరూ సెలబ్రేట్ చేసుకునేలా కార్యాచరణ ఉండాలని సూచించారు.

ఏర్పాట్లతోపాటు కమిటీలు సైతం వేసుకునేలా సిద్ధం కావాలని చెప్పారు. ఆ తరువాత భారీ ఎత్తున ఏప్రిల్ 27న బహిరంగసభ నిర్వహిస్తామని వెల్లడించారు.

పకడ్బందీగా సంస్థాగత నిర్మాణం

పార్టీకి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా సంస్థాగత నిర్మాణం పూర్తి చేసుకుందామని కేసీఆర్ ప్రకటించారు. సంస్థాగత నిర్మాణం స్వరూపాన్ని రూపొందించాలని మాజీ మంత్రి హరీశ్‌రావును ఆదేశించారు. ఏప్రిల్ 27న భారీ బహిరంగసభ నిర్వహించిన తరువాత నుంచి, పార్టీ అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ ముగిసే అక్టోబర్/నవంబర్ నాటికి అన్నిస్థాయిల పార్టీ ప్రధాన కమిటీలు, అనుబంధ కమిటీల ఎన్నికలు పూర్తిచేస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయిలో పార్టీ అనుబంధ విభాగాలను బలోపేతం చేస్తామని చెప్పారు. పార్టీ మహిళ, విద్యార్థి, రైతు, కార్మిక విభాగాలు ఇలా అన్నిస్థాయిల్లో అనుబంధ కమిటీల నిర్మాణం, సదస్సులు, శిక్షణా తరగతులకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. మహిళలకు 33% రిజర్వేషన్ బిల్లు చట్టంగా రూపొందిన నేపథ్యంలో మహిళా విభాగం చురుకైన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు.

పార్టీ శ్రేణులకు ఏలోటూ రానివొద్దు

పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏలోటూ రాకుండా చూడాలని కేసీఆర్ ఆదేశించారు. దేశంలో మరే రాజకీయ పార్టీకి లేని చరిత్ర బీఆర్ఎస్‌కు ఉన్నదని వివరించారు. తెలంగాణ ప్రజానీకంతో, సంస్కృతితో మమేకమై, వారి జీవికలో భాగమైన రాజకీయ పార్టీ బీఆర్ఎస్ ఒక్కటేనని చెప్పారు. పార్టీకి ఇల్లు కిరాయికి ఇవ్వని స్థితి నుంచి ప్రతీ జిల్లా కేంద్రంలో సొంత పార్టీ కార్యాలయాలు ఉన్న ఏకైక పార్టీగా బీఆర్ఎస్ ఎదిగిందని, పార్టీకి పుష్కలమైన నిధులున్నాయని తెలిపారు.

త్వరలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ముఖ్యనాయకులు, కార్యకర్తలు, ఉద్యమంలో పనిచేసిన వివిధ వర్గాలతో త్వరలో సమావేశాలు నిర్వహిస్తామని కేసీఆర్ వెల్లడించారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పడిందని, సర్దుకోవటానికి తగినంత సమయం ఇచ్చామని స్పష్టంచేశారు.

ప్రజలకు ఈ ప్రభుత్వం నచ్చిరాలేదు.. అచ్చిరాలేదు

'ప్రజలకు ఈ ప్రభుత్వం నచ్చిరాలేదు...అచ్చిరాలేదు' అని కేసీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలు, అన్ని సమాజాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై లెక్కలేనన్ని తిట్లు తిడుతున్నరని, తన రాజకీయ జీవితంలో ఇంత అధ్వాన్నమైన ప్రభుత్వాన్ని చూడలేదని చెప్పారు. 14 నెలలకే ప్రభుత్వం దిగుడుముఖం పట్టిందని, ఇక అది లేవలేదని తేల్చిచెప్పారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, బండా ప్రకాశ్, కేఆర్ సురేశ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, బడుగుల

తెలంగాణ రక్షణ కవచం బీఆర్ఎస్సే

ప్రజల ఇంటి పార్టీ 24 ఏండ్లు పూర్తిచేసుకోవడం తెలంగాణ సామాజిక చరిత్రలో ఉజ్వల ఘట్టం: కేటీఆర్

- ఏడాదంతా రజతోత్సవ సంబురాలు నిర్వహిస్తం
- పార్టీ సంస్థాగత నిర్మాణం కూడా పూర్తి చేస్తం
- ఏప్రిల్ రెండోవారంలో పార్టీ ప్రతినిధుల సభ
- అదే నెల 27న భారీ బహిరంగసభ
- ప్రజల ఆర్తిని అర్థంచేసుకున్న పార్టీగా వివిధ వర్గాల తరపున ప్రధాన ప్రతిపక్షంగా పోరాడుతం
- మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజలకు రక్షణ కవచం బీఆర్ఎస్ మాత్రమేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి విముక్తి కోసం చరిత్ర ప్రసవించిన బిడ్డ బీఆర్ఎస్ అని, 24 ఏండ్లు పూర్తిచేసుకొని 25వ వసంతంలోకి అడుగుపెట్టడం తెలంగాణ సామాజిక చరిత్రలోనే ఉజ్వల ఘట్టమని అభివర్ణించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణభవన్‌లో బుధవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటివరకు జరిగిన వివిధ అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్టు చెప్పారు. సుమారు 30 మంది వరకు సీనియర్ నేతలు తమ అభిప్రాయాలు చెప్పారని తెలిపారు. తెలంగాణ ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చేందుకు ఆనాడు జలదృశ్యంలో పార్టీ పురుడు పోసుకొని 24 సంవత్సరాలు పూర్తి చేసుకోవడమంటే మామూలు విషయం కాదని పేర్కొన్నారు. ఎన్నో ప్రజా పోరాటాలకు పుట్టినిల్లు తెలంగాణ అని, సాయుధ పోరాటం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ఎన్నో ప్రజాపోరాటాలు ఈ గడ్డపై జరిగాయని గుర్తుచేశారు.

బలిదానాలతో తల్లడిల్లిన తెలంగాణ

సాయుధ పోరాటం నుంచి ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమం, మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ఎన్నో బలిదానాలతో తెలంగాణ ఎలా తల్లడిల్లిందో? కాంగ్రెస్ పార్టీ ఎలా మోసం చేసిందో.. ఈ సమావేశంలో కేసీఆర్ మరోసారి తమకు గుర్తుచేశారని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఎంత అవసరమో.. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ఎంత అవసరమో.. ఇటీవల కేసీఆర్ పుట్టినరోజు వేడుకలకు వెల్లువలా తరలివచ్చిన ప్రజలే సాక్ష్యమని చెప్పారు. బీఆర్ఎస్ రజతోత్సవాలను ఏడాదిపాటు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణ కోసం ఉద్యమకారులు, పార్టీ ముఖ్యులతో పలు కమిటీలను వారంలో ప్రకటిస్తామని చెప్పారు.

ఏప్రిల్ 9-10న పార్టీ ప్రతినిధుల భేటీ

ఏప్రిల్ రెండో వారంలో పార్టీ ప్రతినిధుల సమావేశం హైదరాబాద్‌లో ఉంటుందని కేటీఆర్ చెప్పారు. త్వరలోనే తేదీ, వేదికను ప్రకటిస్తామని తెలిపారు. పార్టీ 24 సంవత్సరాలు పూర్తిచేసుకొని 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా ఏప్రిల్ 27న బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. అది ఎక్కడ అనేది నాలుగైదు రోజుల్లో వెల్లడిస్తామన్నారు. ఓ వైపు పార్టీ రజతోత్సవ సంబురాలు నిర్వహిస్తూనే, పార్టీ నిర్మాణం, ప్రజా పోరాటాలను కొనసాగిస్తామని వివరించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం, పార్టీ గ్రామ కమిటీలు, మండల కమిటీలు, జిల్లా, రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అక్టోబర్‌లో రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎంపిక కూడా ఉంటుందని తెలిపారు. విద్యార్థి, మహిళ, మైనారిటీ, కార్మిక, సోషల్ మీడియా విభాగం కమిటీలు వేస్తామని, వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. పార్టీ నిర్మాణం, ప్రజా పోరాటాలు, వివిధ రకాల కార్యక్రమాలతో ఏడాదంతా బిజీగా ఉంటామని చెప్పారు. తాగునీరు, కరెంటు సమస్యలు, విద్య, వైద్యం అందించడంలో లోపాలపై పార్టీ సమావేశంలో విస్తృతంగా చర్చించినట్టు తెలిపారు. కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలతో చెలగాటమాడుతున్న విషయంపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్టు పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోరాడకుంటే బీఆర్ఎస్ తరపున తమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, మరో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్రం నుంచి ఉన్నా బడ్జెట్లో కేంద్రం నుంచి తెలంగాణకు నయా పైసా తేలేకపోయారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్ ఢిల్లీలో గనుక ఉండి ఉంటే గతంలోలాగా కేంద్రం మెడలు వంచేందుకు పోరాడేదని గుర్తుచేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజీ పడేదిలేదని తేల్చి చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రజలు, తెలంగాణ సమాజం గెలవాలన్నదే ఈ రోజు జరిగిన సమావేశ సారాంశమని వివరించారు.

> ఏడాది కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణలో సంక్షోభం తలెత్తింది. 430 మంది రైతులు, 57 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నరు. నేత కార్మికులు, ఆటో డ్రైవర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆత్మహత్యలు కూడా ఆగడం లేదు. కాంగ్రెస్ పాలనలో తల్లడిల్లుతున్న ప్రజల కన్నీళ్లను, ఆర్తిని అర్థం చేసుకునే పార్టీగా వివిధ వర్గాల సమస్యలు పరిష్కరించేందుకు ప్రధాన ప్రతిపక్షంగా ముందుండి పోరాడుతం.
>
> -కేటీఆర్

రైతు పోరాటాన్ని కేసీఆర్ మెచ్చుకున్నరు

రైతుల కోసం బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న పోరాటాన్ని పార్టీ అధినేత కేసీఆర్ మెచ్చుకున్నారని కేటీఆర్ చెప్పారు. జనగణన, కులగణన, కాంగ్రెస్ ప్రభుత్వం వంచనపై సమావేశంలో కూలంకషంగా చర్చించామని తెలిపారు. కాంగ్రెస్‌కు బీసీల మీద నిజంగానే ప్రేమ ఉంటే 42 శాతం రిజర్వేషన్ ఎలా ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల ముందు చెప్పి ఇప్పుడు ఎలా సాధ్యమవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం మాటమార్చుతున్నదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పరిపాలన సామర్థ్యం ఏ పాటిదో తెలంగాణ ప్రజలకు అర్థమైందన్నారు. రీ సర్వే చేయాలని డిమాండ్ చేశామని, కానీ కాంగ్రెస్ సర్కారు ఏం చేస్తున్నదో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సమావేశంలో శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొన్నారు.

> తెలంగాణ తల్లి విముక్తి కోసం చరిత్ర ప్రసవించిన బిడ్డ బీఆర్ఎస్. తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా బీఆర్ఎస్ 24 ఏండ్లు పూర్తిచేసుకొని 25వ వసంతంలోకి అడుగుపెట్టడం తెలంగాణ సామాజిక చరిత్రలోనే ఒక ఉజ్వల ఘట్టం. పార్టీ రజతోత్సవ సంబురాలను ఈ ఏడాదంతా ఘనంగా నిర్వహిస్తం. పార్టీ సంస్థాగత నిర్మాణం కూడా చేపడుతం.
>
> -కేటీఆర్

420 అబద్ధాలకు 4.20 లక్షల కోట్ల జరిమానా వేసినా తప్పలేదు

- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ సెటైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): ఫోర్ ట్వంటీ (420) అబద్ధాలు చెప్పిన కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి ఎన్నికోట్ల జరిమానా వేసినా తప్పులేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. సింగపూర్ పార్లమెంట్‌లో రెండు అబద్ధాలు చెప్పిన ఎంపీకి 14 వేల డాలర్ల జరిమానా విధించిన ఘటనపై బుధవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'మరి కాళేశ్వరం గురించి, రాష్ట్ర అప్పుల గురించి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రైతు రుణమాఫీ, రైతుబంధు, రూ.4,000 పింఛన్లు, మహిళలకు రూ.2500 అని.. ఇట్ల 420 అబద్ధాలు చెప్పిన ముసలి నక్క కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌రెడ్డికి రూ.4.20 లక్షల కోట్ల జరిమానా వేసినా తప్పులేదు' అని ఫైరయ్యారు. ఒక్కో అబద్ధానికి 7 వేల డాలర్ల జరిమానా విధించిన సింగపూర్ కోర్టు తీర్పు వార్త, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల పుస్తకాన్ని ఎక్స్‌లో కేటీఆర్ పోస్టు చేశారు.

లోకం పోకడ



తెలంగాణపై మరో రూపంలో చంద్రబాబు అడుగు

- వలసవాద కుట్రలకు తెలంగాణ బలికావొద్దు
- పందామా? కొట్లాడదామా?: కేసీఆర్ హెచ్చరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పదాన్నే అసెంబ్లీలో పలకూడదని హుకుం జారీ చేసిన చంద్రబాబు ఇప్పుడు మళ్లీ మరో రూపంలో తెలంగాణలో అడుగుపెట్టాలని చూస్తున్నారని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'తెలంగాణ ఇప్పుడు మళ్లోసారి వలసవాద కుట్రలకు బలికావద్దు. గతం గాయాలనుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నం. తిరిగి వలస వాద పాలకుల చేతిలో పడితే తెలంగాణ కోలుకోకుండా ఆగమయ్యే ప్రమాదమున్నది' అని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృతస్థాయి కార్యవర్గల సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ 'చంద్రబాబు రోజూ కృష్ణానీళ్లను మళ్లించుకపోతున్నడు. దీన్ని కనీసం అడ్డుకోవటం కాదు కదా కనీసం ఇదేందని ప్రశ్నించే పరిస్థితిలేదు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో తెలంగాణ సమాజం ఆందోళన చెందుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణకు శాశ్వతంగా న్యాయం జరగాలంటే మనం ప్రజలను తిరిగి చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూలేనంత పజీతకు తెలంగాణ లోనవుతున్నదని ఆవేదన చెందారు. ఈ విపత్కర పరిస్థితుల్లో 'పందామా? కొట్లాడదామా?' అని ఆయన ప్రశ్నించారు. ఎన్నటికైనా తెలంగాణకు రక్షణ కవచం బీఆర్ఎస్సేనని, ఆ బాధ్యత ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త తన భుజస్కంధాలపై వేసుకోవాలని హితబోధ చేశారు. గులాబీ శ్రేణులు మరో చారిత్రక చైతన్యానికి పూనిక వహించాలని ఉద్బోధించారు. 'తెలంగాణ జాతి ప్రస్థానంలో తలెత్తిన గాయాలు బాధలను పూర్తిగా తొలగిపోయే విధంగా.. స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే విధంగా, తెలంగాణ తనకు తాను నిలబడాలని పుట్టిందే మన పార్టీ. అటువంటి చారిత్రక పాత్రను పోషించడానికే సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా సంసిద్ధులం కావాలి' అని పిలుపునిచ్చారు..

కేసీఆర్ పాస్‌పోర్ట్ రెన్యూవల్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన పాస్‌పోర్ట్‌ను రెన్యూవల్ చేయించుకున్నారు. రెన్యూవల్‌లో భాగంగా కేసీఆర్ దంపతులు బుధవారం సికింద్రాబాద్‌లోని రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి విచ్చేశారు. హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ ఆధ్వర్యంలో వేలిముద్ర, సంతకం, ఫొటో తదితర ప్రక్రియలను పూర్తి చేశారు. కాగా, కేసీఆర్ వచ్చారనే విషయం తెలుసుకున్న అభిమానులు భారీఎత్తున పాస్‌పోర్టు కార్యాలయానికి చేరుకున్నారు. తమ అభిమాన నేతను చూసేందుకు పోటీపడ్డారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకొని మురిసిపోయారు. కేసీఆర్ వెంట మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఉన్నారు.

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

మెదక్ డీసీసీ అధ్యక్షుడికి భారీ షాక్

- సొంత గ్రామ కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక

నర్సాపూర్, ఫిబ్రవరి 19 : కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌కు స్వగ్రామంలో షాక్ తగిలింది. రెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కురుమ నవీన్, ఆంజనేయులు, పవన్, ప్రశాంత్, మనోహర్‌కు సునీతాలక్ష్మారెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో వైఫల్యం చెందిందని, కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

భారత ప్రభుత్వం
డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్
ప్రెస్ నోట్
తేదీ: 18 ఫిబ్రవరి 2025